## సమాచారం

### విద్యుత్ ఉండని ప్రాంతాలు



బండ్లగూడ: హిమాయత్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. డాన్ బాస్కో ఫీడర్‌లో ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకు మైఖేల్ కాలనీ, వినాయక్‌నగర్, డీడీ కాలనీ, కాళీమందిర్, ఎన్‌ఎఫ్‌సి కాలనీ, ఆదర్శనగర్, ఎక్సైజ్ అకాడమీ, అభ్యుదయనగర్, అరుణోదయనగర్, సంధ్యానగర్, జీఆర్‌నగర్, మంచన్‌పల్లి ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

**నార్సింగి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..**

మణికొండ: నార్సింగి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ సందీప్‌రెడ్డి తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని బృందావన్ కాలనీ, గ్రేహౌండ్స్, మంచిరేవుల, వీరభద్రస్వామి ఆలయం, ఎన్‌సీసీ అర్బన్ టవర్స్, శ్రీకృష్ణ గోశాల, శ్రీనగర్ ప్రాంతాలలో సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

**కోకాపేటలో...**

కోకాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో.. ఉదయం 11గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కోకాపేట గ్రామం, గోల్డన్‌మైల్, బాబుఖాన్ విల్లాస్, ఘర్ సంస్థ, ప్రెస్టేజ్ విల్లాస్, 250 గజాల కాలనీలలో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

### మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్ రూరల్: మండలంలోని పాలమాకులలో ఉన్న మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతితో పాటు ఏడు నుంచి 10వ తరగతిలో అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విష్ణుప్రియ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 15 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఫలితాలు మే 15న వెలువడుతాయని తెలిపారు. జనరల్ కేటగిరి విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125 చెల్లించాలన్నారు.వచ్చే విద్యా సంవత్సరం జూన్ 1 నుంచి తరగతులు ఉంటాయన్నారు.

## క్లుప్తంగా...

### ఘనంగా సుదర్శన యాగం



యాగంలో పాల్గొన్న జడ్పీటీసీ తన్వీరాజు


శంషాబాద్ రూరల్: మండలంలోని నర్కూడ శివారులో ఉన్న అమ్మపల్లి (శ్రీసీతారామచంద్ర స్వామి) ఆలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సుదర్శన యాగం నిర్వహించారు. శనివారం చివరి రోజు పూర్ణాహుతి, స్వామి కల్యాణోత్సవం జరగనుంది. కార్యక్రమంలో జడ్పీటీసీ తన్వీరాజు, ఆలయ కమిటీ డైరెక్టర్లు ఏ.మహేష్‌కుమార్, సొసైటీ డైరెక్టర్ శివాజీ దంపతులు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు ఏ.స్వరూప, భక్తులు పాల్గొన్నారు.

### డైరీ ఆవిష్కరణ



మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.రత్నాకర్‌రావు శుక్రవారం ఆవిష్కరించారు. శివరాంపల్లిలోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఆయన అధికారులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు శ్రీనివాస్, ఈశ్వర్‌ప్రసాద్, సత్యనారాయణ, అసిస్టెంట్ ఇంజనీర్లు హరినాథచారి, హాధిరాం, శ్రీనివాస్, నాగమణి, రవీందర్, వెంకటకృష్ణ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### అభినందన



మైలార్‌దేవ్‌పల్లి: బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు విజయశాంతిని శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. రాజకీయ ప్రస్థానం25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నాంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో ఆమెను కలిసి అభినందనలు తెలిపారు.

# కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు

- మేయర్ మహేందర్‌గౌడ్
- బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 3వ వార్షికోత్సవం
- నూతన అంబులెన్స్ ప్రారంభం



కార్పొరేషన్ నూతన అంబులెన్స్ సర్వీసును ప్రారంభిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ వెల్లడించారు. శుక్రవారం కార్పొరేషన్ 3వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. 60 కిలోమీటర్ల రోడ్లు, 66 కిలోమీటర్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, 18 పార్కులు, 1 వెజ్–నాన్ వెజ్ మార్కెట్, 8 కమ్యూనిటీహాల్స్, 9 శ్మశానవాటికలు, 7 ప్రహరీ గోడల నిర్మాణం, ఫెన్సింగ్, ఒక వైకుంఠధామం, 12 క్రీడా ప్రాంగణాలు, 9 ఓపెన్ జిమ్‌లు, 5 రూపాయల భోజన కేంద్రం, స్ట్రీట్ వెండింగ్ జోన్, నూతన ఆఫీస్ బిల్డింగ్ తదితర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మొత్తం 128 కోట్ల 46 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసేందుకు శాయశక్తుల కృషి చేస్తామన్నారు. అనంతరం కార్పొరేషన్ వార్షికోత్సవం సందర్భంగా కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

**అంబులెన్స్ ప్రారంభం...**

కార్పొరేషన్ పరిధిలో నూతన అంబులెన్స్ సర్వీసు ప్రారంభించామని మేయర్ మహేందర్‌గౌడ్ వెల్లడించారు. ఈ మేరకు కొత్త అంబులెన్స్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన వెంటనే సంప్రదిస్తే ప్రజలకు సేవలు అందించేందుకు తక్షణం చేరుకుంటుందన్నారు. 24 గంటల పాటు ఈ అంబులెన్స్ అందుబాటులో ఉంటుందన్నారు.



కార్పొరేషన్ 3వ వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న దృశ్యం

ఆయా ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగితే అంబులెన్స్ సర్వీసు పొందాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



12 వార్డులో డ్రైనేజీ పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ

శంషాబాద్: పారిశుద్ధ్య సమస్యలు లేని పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అన్నారు. పట్టణంలోని 12వ వార్డులో కౌన్సిలర్ ప్రవీణ్‌గౌడ్‌తో కలిసి శుక్రవారం అంతర్గత డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా అంతర్గత డ్రైనేజీల ఏర్పాటుకు అత్యధికంగా నిధులు వెచ్చించామన్నారు. పురపాలక శాఖ నుంచి రానున్న మరో యాభై కోట్ల బడ్జెట్ నిధులతో మౌలిక సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాల్ యాదవ్, అధికారులు పాల్గొన్నారు.



## చెత్తపై అవగాహన ర్యాలీ

మణికొండ: చెత్తను తడి, పొడి వేరు చేసి ఇవ్వాలని, రోడ్ల పక్కన ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయవద్దని, పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మున్సిపల్ కార్మికులు ఫ్రెండ్ కాలనీ నుంచి గోల్డన్ టెంపుల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటేషన్ ఇంచార్జి సంపత్ మాట్లాడుతూ మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచేందుకు నిత్యం కార్మికులు ఎంతగానో శ్రమిస్తున్నారన్నారు. వారికి ప్రజలు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇస్తే వర్మి కంపోస్టును తయారు చేస్తామన్నారు. శానిటేషన్ సూపర్‌వైజర్‌లు, కార్మికులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సుల్తాన్‌పల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచు ఇస్తారి

శంషాబాద్ రూరల్: మండలంలోని సుల్తాన్‌పల్లిలో సీసీ రోడ్డు పనులను సర్పంచు దండు ఇస్తారి శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ చొరవతో రూ.25 లక్షలు మంజూరయ్యాయని సర్పంచు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్పందన, ఎంపీటీసీ సంగీత, వార్డు సభ్యులు కృష్ణ, వీరాచారి, సత్తమ్మ, అరుంధతి, శ్రీశైలం, చంద్రశేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

# మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



విగ్రహ ప్రతిష్టాపన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: ప్రార్థనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ ఈవీవీ కాలనీలో నూతనంగా నిర్మించిన పంట మైసమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన పూజలకు ఆయన శుక్రవారం హాజరయ్యారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్, పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ధన్‌రాజ్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, కౌన్సిలర్‌లు నవీన్‌కుమార్, వసంతరావు, నాయకులు జయరాజ్, శ్రావణ్‌కుమార్, దిలీప్‌కుమార్, లక్ష్మీశ్రీ,, లతగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మల్కారంలో డీపీఓ పర్యటన



మండలంలోని మల్కారంలో పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న డీపీఓ శ్రీనివాస్‌రెడ్డి

శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారంలో శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. గ్రామంలో ఉన్న పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్యాలయం నూతన భవనం కోసం నిధులు మంజూరు కాగా.. నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని సూచించారు. గ్రామంలో జరుగుతున్న ఇతర అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచు మాధవి యాదగిరిరెడ్డి, ఉపసర్పంచు లలిత జంగయ్య, ఎంపీఓ ఉషాకిరణ్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

# నేరాలను అరికట్టేందుకు సహకరించాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ మహేష్

**రాయదుర్గం సీఐ మహేష్**

మణికొండ: సమాజంలో జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు ప్రజలు సైతం పోలీసులకు సహకరించినపుడే మంచి ఫలితాలు వస్తాయని రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ మహేష్ అన్నారు. శుక్రవారం మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోక్సో చట్టం, డ్రగ్స్ వాడటం వలన కలిగే అనర్థాలు, నేరాలను అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలపై ఈ మధ్య లైంగిక వేధింపులు జరుగుతున్నాయని, ఎవరైనా తాకరాని చోట తాకితే ఆ విషయాన్ని వెంటనే ఉపాధ్యాయులు, తల్లితండ్రులకు తెలిపితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. నేరాలపై తమకు సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు సతీష్, నాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి'

రాజేంద్రనగర్: రాష్ట్ర గవర్నర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా నాయకుడు వేముల మల్లేష్ డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి బాధ్యతారహితంగా మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. గవర్నర్‌పై ఘాటైన పదజాలాన్ని ఉపయోగించడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## 29న పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌పరిధిలోని శారదాధామంలో పూర్వ విద్యార్థుల రాష్ట్రస్థాయి మహాసమ్మేళనం ఈ నెల 29వ తేదీన నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థి పరిషత్ ప్రధాన కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్, సంఘటన కార్యదర్శి రాజారెడ్డిలు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సమ్మేళనంలో వివిధ రంగాల్లో స్థిరపడిన సుమారు 2500 మంది పూర్వ విద్యార్థులు వారికి విద్యాబుద్ధులు నేర్పించిన 300 మంది పూర్వ ఆచార్యులు, శిశుమందిర్ అన్ని పాఠశాలల కమిటీ సభ్యులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షులు డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు, దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి లింగం సుధాకర్‌రెడ్డి, పూర్వ విద్యార్థి పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు హరిస్మరణ్‌రెడ్డిలు హాజరవుతారన్నారు.

# 1,2 తేదీల్లో సమ్మక్క, సారలమ్మ జాతర



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మానసహిల్స్ సమ్మక్క సారలమ్మ గుట్టపై ఎదురు పున్నమి జాతరను ఫిబ్రవరి 1,2వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జాతర నిర్వాహకులు నిరుడు శ్రీరాములు ముదిరాజ్ తెలిపారు. రాజేంద్రనగర్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతర సందర్భంగా గుట్టను ముస్తాబు చేస్తున్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాలకు ఒకసారి ఎదురు పున్నమి జాతరను భారీగా రెండు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. ఈ జాతరకు రాజేంద్రనగర్‌తో పాటు తెలంగాణలోని అన్నిజిల్లాల నుంచి భక్తులు తరలి వస్తారన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. 1వ తేదీ ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలతో జాతర ప్రారంభం అవుతుందన్నారు. అమ్మవారికి కుంకుమ భరిణ సమర్పించి జాతరను ప్రారంభిస్తామన్నారు. మధ్యాహ్నం భక్తులకు గుట్టపై అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు జాతరకు తరలిరావాలని కోరారు.

## రౌడీ షీటర్‌పై హత్యాయత్నం

మణికొండ: రౌడీషీటర్ మహ్మద్‌గౌస్‌పై కోకాపేటలో హత్యాయత్నం జరిగింది. గురువారం గాలిపటాలను ఎగురవేసేందుకు కోకాపేటకు వచ్చాడు. పాత గొడవలు ఉన్న 20మంది విషయం తెలుసుకొని అక్కడకు వచ్చి దాడి చేశారు. దీంతో తలకు గాయాలయ్యాయి. వారి నుంచి తప్పించుకొని నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దాడిలో పాల్గొన్నది రాజేంద్రనగర్‌కు చెందినవారిగా అనుమానిస్తున్నారు. మహ్మద్‌గౌస్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయటంతో కొంత కాలంగా జైలులో ఉండగా, ఇటీవలే విడుదలయ్యాడు.

# బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పెద్ద పీట వేస్తుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మొఘల్స్ కాలనీలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. రహీం, ఫయిమ్, అక్రమ్, సద్దామ్, అహ్మద్, బాబా, తస్కీన్, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

## రాయదుర్గంలో అధికారుల పర్యటన



రాయదుర్గం: రాయదుర్గం, గచ్చిబౌలి ప్రాంతాలలో శుక్రవారం జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు పర్యటించారు. ముఖ్యంగా నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు పనులను, రాయదుర్గం నుంచి గచ్చిబౌలి వరకు అర్బన్ సీటింగ్ పనులను రాయదుర్గం, గచ్చిబౌలి ప్రాంతాలలో ఫుట్‌పాత్ నిర్మాణ పనులను జోనల్ కమిషనర్ శంకరయ్య, జీహెచ్ఎంసీ యూబీడీ అదనపు కమిషనర్ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ వెంకన్న, ఈఈ శ్రీనివాస్, యూబీడీ మేనేజర్ యూసుఫ్‌పాషా, ఏఎంఓహెచ్ నగేష్‌లు పరిశీలించారు.



# మనో నిబ్బరంతో రాయడానికే..



పరీక్షాపే చర్చ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

**పాఠశాలల్లో పరీక్షా పే చర్చ**

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాలలో పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుగుణ, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, డివజిన్ బీజేపీ అధ్యక్షులు జి.బాబురావు, తొండుపల్లి మల్లేష్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బుద్వేల్ పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎగ్జామ్స్ వారియర్స్ బుక్స్ అందించారు.

**సీబీఐటీలో ..**

మణికొండ: పరీక్షలపై విద్యార్థులకు మనోనిబ్బరాన్ని కలిగించటంతో పాటు వాటిపై భయాన్ని పోగొట్టే క్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొన్న పరీక్షాపే చర్చ కార్యక్రమాన్ని గండిపేటలోని సీబీఐటీ కళాశాల విద్యార్థులు వీక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి, పీఆర్‌ఓ డాక్టర్ జీఎస్‌ఆర్ ప్రసాద్, అధ్యాపకులు తులసిరామ్, డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

**కాటేదాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ..**

మైలార్‌దేవ్‌పల్లి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని మైలార్‌దేవ్‌పల్లి కాటేదాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, నాయకులతో కలిసి కార్పొరేటర్ శ్రీనివాసరెడ్డి తిలకించారు.మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని రాణించాలన్నారు. డివిజన్ అధ్యక్షులు అడికే జనార్దన్, జోగి రవి, తోకల సుధాకర్‌రెడ్డి, రావుల భాస్కర్, తలారి చిన్న, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

# చెట్లు ఎండి.. చెత్త చేరి..



లక్ష్మీవిహార్ ఫేజ్–1 కాలనీ పార్కులోని వాకింగ్ ట్రాక్‌లో చెత్త చెదారం

**లక్ష్మీవిహార్ ఫేజ్–1 కాలనీ పార్కు దుస్థితి**

శేరిలింగంపల్లి: పార్కుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో కాలనీవాసులు కాలు మోపేందుకు జంకుతున్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని లక్ష్మీవిహార్ ఫేజ్–1 కాలనీలో నారాయణ జూనియర్ కళాశాల పక్కన ఉన్న పార్కును జీహెచ్ఎంసీ లక్షలాది రూపాయలతో అభివృద్ధి చేసింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పార్కు గడ్డితో నిండిపోయింది. మొక్కలు ఎండిపోతున్నాయి. పార్కు ప్రహరీ ధ్వంసం అయింది. పార్కు చిల్డ్రన్ ఏరియాలో వస్తువులు తుప్పుపట్టిపోతున్నాయి. ఇక వాకింగ్‌ట్రాక్ ఆనవాలు లేకుండాపోయింది. పార్కులో గడ్డి పెరిగిపోవడంతో పాములు సంచారం ఉంటుందని స్థానికులు రావడం లేదు.

**నీటికి కట కట...**

పార్కు నిర్వహణకు నీరు అందించే పవర్ బోరు పని చేయకపోవడంతో నీటికి కటకటగా మారింది.దీంతో మొక్కలు ఎండిపోతున్నాయి. లక్షలు వెచ్చించిన పార్కు నిరుపయోగంగా తయారైంది. అర్బన్ బయోడైవర్సిటీ అధికారులు పార్కును పట్టించుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



తుప్పు పట్టిన పిల్లల ఆటవస్తువులు



